# అనాదిహింస

నడిరోడ్డు మీద, అందరూ చూస్తుండగా... బూతులు తిట్టి యిష్టమొచ్చినట్టు కొట్టి ఎన్నో రకాలుగా జంతువుల్ని హింసిస్తుంటారు... ఎవరూ పెద్దగా పట్టించుకోరు....

xxx

ఆరడుగుల ఎత్తూ, మంచి నలుపూ వున్న ఆ మగమనిషి, ఆ నల్లటి అమ్మాయిని చెయ్యి పట్టుకుని రాక్షసంగా లాగుతున్నాడు. పెద్దగా బూతులు తిడుతున్నాడు.

"వదులు... నన్నొదులు..." అంటూ ఆ అమ్మాయి గట్టిగా అరుస్తోంది. గింజుకుంటోంది. ఆ అమ్మాయి మంచి బలంగా వుండటం వల్ల వారి ఘర్షణ చూపురులకి ఆకర్షణీయంగా వుంది.

పెద్ద విలన్ పక్కన, చిన్న విలన్లా,వీళ్లకి కొంచం వెనగ్గా, మరో మగ మనిషి వో ఎర్రటి ఆడమనిషిని అదే పద్ధతిలోచెయ్యి పట్టుకుని లాగుతున్నాడు.

"బాబూ నన్నొదులు... వదిలేయి..." అని ప్రాధేయపడుతోంది ఆ ఎర్రటి స్త్రీ... ఆ ప్రాంతంలో కొత్తగా ఫ్లైవోవర్ కడుతూండటం

వల్ల ప్రముఖమైన సినిమా హాలు వుండటం వల్ల... యీ సీన్‌కి ప్రేక్షకుల రద్దీ పెరుగుతూ వచ్చింది. జరుగుతున్నది ఏమిటో అర్థం కాకపోయినా చూట్టానికి వింతగా, ఖర్చులేని వినోదంలా వుంది చాలామందికి.

మొదట ఆట బుకింగ్ మొదలవటానికి టైముంది. సినిమాకి కొంచెం ముందుగా వచ్చిన వాళ్ళకి యీ తతంగం అనుకోని కాలక్షేపంలా తయారైంది.

కాస్సేపటికి ఆ హడావిడి యింకొంచెం పెరిగింది. ఆ ఇద్దరు ఆడాళ్ళనీ బరింత గట్టిగా లాగుతూ ఆ మగాళ్ళు మరింత గట్టి బూతులు తిడుతున్నారు. బలమైన అమ్మాయి పమిట జారి జీరాడుతోంది ఎర్రటి అమ్మాయి కొప్పు వూడిపోయి జుట్టంతా చెదిరిపోయింది.

"రా" అంటూ నల్లటతను పమిట జారిన అమ్మాయిని ఆటో దగ్గరికి లాక్కెళ్ళి లోపలికి కక్కుతున్నాడు. సిగ్గుపడే అవకాశం కూడా లేదు ఆ ఆడాళ్ళకి. ఆ మగాళ్ళ చేతులు యిక్కడా అక్కడా అన్నభేదం లేకుండా ఆ ఇద్దరమ్మాయిల వంటిమీద పడుతున్నాయి.

"రమ్మంటుంటే... ఏంటా మొరాయింపు..." ఎర్రటి అమ్మాయిని మరింతగా ఆటోవేపు లాగుతూ రెండో అతనూ అరిచాడు.

"బాబ్బాబు... నా మాట యినండి... యిందులో నేను చేసిందేం లేదు... నన్నొదిలేయండి... మీకు పుణ్యం వుంటుంది... మీతో వచ్చి నేను తట్టుకోలేను... నన్నొదిలేస్తే మీరేం చెబితే అది చేస్తా... సరేనా..." అంటూ ఎర్రటి అమ్మాయి కిందకి జారి రెండో అతని కాళ్ళు పట్టేసుకుంది.

ఈ హఠాత్ చర్యకి అతను షాకై ఏం చెయ్యాలో తోచనట్టు బిక్క ముఖం వేసి ఆటో దగ్గరున్న నల్లటతని వేపు చూశాడు. నల్లటతను హడావిడిలో వుండి ఇతని వేపు చూళ్ళేదు.

" ఆ ఎర్రటి అమ్మాయి అలా కాళ్ళ మీదపడి బతిమాలుతుంటే యీ నల్లటమ్మాయి చూడు ఎలా ఎదురుతిరుగుతుందో, చూస్తుంటే పెద్ద రౌడీలా వుందే..." అన్నాడు మూర్తి మోహనరావుతో.

"ఆ అమ్మాయి రౌడీ ఏం కాదు... తెలియకుండా మాట్లాడకండి...."

కొంచం గట్టిగా వినిపించిన ఆ గొంతుక్కి మూర్తి, మోహనరావు లిద్దరూ వెనక్కి తిరిగారు.

చామన ఛాయ. కోల ముఖం. రింగుల జుట్టు.

" నా పేరు రాంబాబండి.. పార్కింగ్..." అన్నాడు అతను.

"పార్కింగేమిటి?" అనడిగాడు మూర్తి.

"అదేనండి... యీ సినిమాహాలు పార్కింగ్‌లో నా ఉద్యోగం" మళ్ళీ రాంబాబే చెప్పాడు.

మోహన్‌రావు, మూర్తి కలిసి మొదటి ఆట సినిమాకి వచ్చారు.

వీళ్ళ ముగ్గురి మాటలు మరింత ముందుకి సాగేలోపు ఆడవాళ్ళ హడావిడి ముగిసిపోయింది. మొత్తానికి ఎర్రటి అమ్మాయినివదిలేసి, నల్లటి అమ్మాయిని ఆటోలో కుక్కి తీసుకుపోయారు ఆ మగాళ్ళు.

జారిన జుట్టు ముడి వేసుకుంటూ, ముక్కూ ముఖం తుడుచుకుంటూ ఆ ఎర్రటి అమ్మాయి, పెద్ద బురదగుంటలోంచి బైట పడ్డ జంతువులా దీనంగా, జనాన్ని తప్పించుకుంటూ ఓ మూలకెళ్ళి అక్కడ నుండి కనుమరుగైపోయింది.

హడావిడి పలచబడటంతో జనంలో కదలిక మొదలైంది. అప్పటి వరకు చూపులకి వినోదంగా వున్న ఆ దృశ్యం, కొంతమంది మనసుల్ని, ఆలోచనల్ని స్పృశించటం ఆరంభించింది.

"ఎంత అన్యాయం... ఇంతమంది జనం ముందు... ఇద్దరాడాళ్ళని యింతసేపు హింసించినా ఎవరూ కల్పించుకోలేదు... ఎంత దారుణం... కనీసం ఎవరూ పోలీసులనైనా పిలవలేదు..." అన్నాడు మోహనరావు.

"మీరు భలేవారండీ.. ఇదంతా పోలీసులకి తెలవకుండానే జరుగుతోందంటారా?" అన్నాడు రాంబాబు.

కళ్ళముందు జరిగిందే భయంకరమైతే, అంతకన్నా భయంకరం, దాన్ని అంతసేపు వినోదంలా చూడగలిగిన స్థాయికి చాలామంది జనం చేరిపోవటం. ఓ అమ్మాయిని ఆటోలో సామాన్ని కుక్కినట్టు కుక్కి తీసుకుపోతుంటే ఏ గొంతూ పెగిలిరాలేదు. దీని తాలూకు బాధ కొంత రాంబాబు ముఖంలోనే కనిపిస్తోంది.

'బహుశా ఆ నల్లటమ్మాయి యీ రాంబాబుకి ఏదైనా అవుతుందేమో... లేకపోతే మిగిలిన వాళ్ళకి లేని ఉలుకు వీడికెందుకు...' అన్న యిరుకు ఆలోచన కదిలింది మూర్తిలో. మరో క్షణం గడిస్తే ఏదో రకంగా ఆ విషయం అడిగేవాడే.

"ఆటోలో బలవంతంగా తీసుకుపోయారే ఆ నల్ల అమ్మాయి... ఆ అమ్మాయి పేరు పద్మ... కాళ్ళా వేళ్ళా పడి తప్పించుకుపోయిందే ఆ అమ్మాయి లక్ష్మి... యిద్దరూ మా సినిమాహాల్ ముందు బేచ్ వాళ్ళే.." అన్నాడు రాంబాబే తిరిగి.

"జాలిగా, చాలా అభిమానంగా మాట్లాడుతున్నావు... ఆ ఆడాళ్ళు నీకు బాగా తెలుసేమిటి...." అనడిగాడు మూర్తి నవ్వుతూ... "మాది వెస్ట్ గోదావరండి... బియ్యే

పాసయ్యానండి. చాలా రోజులు తిరిగి వాళ్ళని వీళ్ళని పట్టుకోగా యీ సినిమాహాలు వుద్యోగం దొరికింది...కానీ ఇంతవరకూ వుండటానికి సరైన చోటు దొరకలా వసతైన రూము దొరక్క కాదండి...నెలకొచ్చే జీతంలో సగం పైగా అద్దెకే పోతుంది..."

రాంబాబు మాటలు వింటూ ఎదురుగా నిలబడ్డారు మూర్తి, మోహనరావు. "నెల నెలా జీతం వచ్చే నా పరిస్థితే యిలా వుంటే.... రోడ్డు మీద నిలబడి వొళ్ళమ్ముకు బతికే ఆ లక్ష్మి, పద్మా అంటే జాలి కాక ఏమిటి చెప్పండి..." అన్నాడు రాంబాబు. రాంబాబు మాటలు వివరంగా అర్థం కాకపోయినా, అప్పటి దాకా జరిగిన బీభత్సానికి సంబంధం వున్నదే అని తెలుస్తోంది మోహనరావుకి, మూర్తికి.

ఇంకా సినిమాకి సమయం వుంది. విషయం ఏమిటో తెలుసుకునే అవకాశం దొరికింది. మరి కాపేప్పటికి ముగ్గురూ పక్కనే వున్న హోటల్లో టీకి చేరారు.

"ఇందాక మీ సినిమాహాల్ ముందు బేచ్ అన్నావు...అంటే..."అనడిగాడు మోహనరావు. "మా హాల్ ముందు నిలబడి వ్యాపారం చేసుకునే ఆడాళ్ళ గ్రూప్ ఒకటుందండీ...మార్నింగ్ షో నుంచి సెకండ్ షో వరకూ హాలు బైట తచ్చాడుతూ బేరాలు చూసుకుంటారు... బేరం కుదిరితే వెళ్ళి, మళ్ళీ బేరానికి వస్తారు..."

" మరి ఆ మగాళ్ళెవరూ..." అనడిగాడు మూర్తి. " ఈ ఆడాళ్ళలాగే వాళ్ళదీ ఓ బేచ్... ఈ ఆడాళ్ళందరి దగ్గరా మామూళ్ళు వసూలు చేస్తారు. వాళ్ళు చెప్పినట్టు వినక పోయినా మామూళ్ళు సరిగ్గా యివ్వకపోయినా చూశారుగా యిందాకా...అలా నానా గొడవా చేస్తారు..."

"ఆ వెధవలు అలా యిష్టం వచ్చినట్టు చేస్తే మాత్రం...యీ ఆడాళ్ళు పడుంటమేనా...ఏరకంగానూ ఎదురు తిరగరా...."అన్నాడు మోహనరావు.

" ఎదిరించి ఏం లాభం...యిందాకా మీరే అన్నారుగా... పద్మని రౌడీ అని...చాలా మంది అలాగే అనుకుంటారు...లేకపోతే మరింత అనహ్యాంగా యింకేదో అనుకుంటారు...అంలేకానీ ఈ అమ్మాయి కడుపు మంట ఎవరిక్కావాలి..." టీ వేడిని లోపలికి తాగుతూ అన్నాడు రాంబాబు. చాలా మామూలుగా అన్నా, రాంబాబు మాటల్లో పదునుంది. నిజమే ఈ అమ్మాయి బాధేమిటో ఎవరికి తెలుసు...తమలో మాత్రం సరైన ఆలోచన ఎక్కడుంటుంది. ఓ టీ యిప్పించి అడిగితే చెప్పే రాంబాబు దొరికాడు కాబట్టి అడిగి వింటున్నారు.

ఏదో విషయం తెలుస్తుందిలే అన్నట్టు ప్రారంభించిన సంభాషణ రంగు మారింది. తామెక్కువ, రాంబాబు తక్కువ అన్న ఉద్దేశం మోహనరావులో క్రమేపి కరిగిపోతూ వచ్చింది. అక్కడ జరిగింది, జరుగుతున్నది తమ మామూలు పరిధికి భిన్నమైందన్న అభిప్రాయం ఏర్పడింది.

"జరిగిందంతా చూశాను...నీ మాటలు విన్నాను. అయినా నాకు పూర్తిగా విషయం అర్థం కావటం లేదు..." అన్నాడు రాంబాబు వేపు చూస్తూ మోహనరావు.

" నాకూ కొంతే తెలుసు...యీ హాల్లో చేరిన తర్వాతే నేనూ వీళ్ళని చూట్టం. పరిచయం అయ్యాక చాలాసార్లు పద్మతో వెళ్ళాను..." అన్నాడు రాంబాబు. " పద్మతో వెళ్ళటం అంటే..." అనడిగాడు మూర్తి.'వెళ్ళటం అంటే' అర్థం కాక కాదు, మరిన్ని వివరాల కోసం. మూర్తి ప్రశ్నని రాంబాబు పట్టించుకోలేదు, మోహనరావు వేపు చూస్తూ..."పద్మని చూశారుగా...డబ్బు కోసమే వొళ్ళమ్ముకుంటుంది. ఆమె వొంటి కోసమే డబ్బివ్వటం. పూర్తిగా వ్యాపారమే...కానీ నేనూ తనూ మరింత దగ్గరగా వుంటాం... తనకి ఖాళీ అయి బేరం లేకపోతే నన్ను పిలుస్తుంది. కేవలం డబ్బు, పడకే కాదు. ఒకరికొకరం తెలిసున్న మనుషుల్లా గడప గలుగుతున్నాం..."

రాంబాబు తనలోకి తను ములిగి పోయినట్టు చెప్పాడు. అక్కడ జరిగే వ్యాపార విధానం, రేట్లు...నాలుగు గోడల చాటైనా లేని ఆరు బైట ప్రదేశాల్లో చీకటి శృంగారం....అతనేం చెప్పినా కేవలం పద్మ గురించి చెప్పినట్టే చెప్పాడు. అలా పద్మ గురించి మాట్లాడుతూ..." పద్మ చిత్రమైన మనిషండీ...నవ్వుతుంది...మూతి ముడుచుకుంటుంది.ఏదైనా తన బాధ చెప్పాలనిపించకపోతే మాట్లాడ కుండా మూగగా వుంటుంది.అంతే తప్ప ఎప్పుడూ ఎవరి ముందూ ఏడవదు. ఆమె కళ్ళు తడి అవటం నేనెప్పుడూ చూళ్ళేదు. అబద్ధాలాడుతుంది. నమ్మించి మోసం చేస్తుంది...కానీ ఎవరినీ కాళ్ళా వేళ్ళా పడి బతిమాలదు. తనకి నచ్చకపోతే ఓపికున్నంత వరకూ ఎదిరిస్తుంది...పోట్లాడుతుంది బాధలూ పడుతుంది.

"అదే లక్ష్మి... ఆ ఎర్రటి అమ్మాయి...తనే కాదు...వీళ్ళలో చాలామంది నిమిషానికో మాట...క్షణానికో పద్ధతి. వీధి కుళాయిలా ఏడుస్తారు....ఎక్కడి దాకో ఎందుకు... యిందాకా జరిగిందే తీసుకోండి....రోజూ లక్ష్మి, పద్మ కలిసే వుంటారు. కానీ పద్మని ఒక్కదాన్నే వాళ్ళకి వదిలేసి లక్ష్మి ఎలా తప్పించుకుందో చూశారా..." అన్నాడు.

"ఇంతకీ ఈ ఆటోలో పద్మని అలా బలవంతంగా ఎందుకు లాక్కుపోయారు... ఏమిటీ వాళ్ళ అధికారం..." అనడిగాడు మోహనరావు రాంబాబుని.

"వాళ్ళ అధికారం ఏమిటో, వాళ్ళ వెనక ఎవరున్నారో తెలిసీ ఏం చెయ్యగలం. ఎవరేనా ఒక్కటే వాళ్ళకి ఎదురు లేకుండా సాగుతోంది. ఈ ఆడాళ్ళ వ్యాపారం జరిగేది పబ్లిక్‌జాగాల్లో...ఏమేనా గొడవలు జరిగితే సాయం వస్తారని వీళ్ళు వాళ్ళకి మామూళ్ళిస్తారు. పద్మా యిస్తుంది. కానీ వాళ్ళు చెప్పినట్టల్లా వినదు.

అందుకే వాళ్ళకి కోపం. పైకి డబ్బు గొడవలే చెబుతారు. మిగిలిన వాళ్ళల్లా కాళ్ళా వేళ్ళా పడి ప్రాధేయపడదని, ఎదిరిస్తుందనీ పద్మ మీద లోలోపల

కోపం.....కసి......."

రోడ్లమీద నిలబడి శరీరాన్ని అద్దెకిచ్చుకోవటంలో ఆడాళ్ళు పడే బాధ...వెర్రి నవ్వుల వెనుక, మొండితనపు మొరటు తనం వెనుకా వాళ్ళల్లో అనుక్షణం కదిలే దైన్యం ప్రత్యేకంగా పట్టించుకుంటే కానీ అర్థం కాని విషయాలు. అందులో ఈ రకం వీధి వ్యభిచారం...ఆరు బైట స్థలాల్లో సెక్స్...ఒకే రోజు ఎందరో చవకబారు మగాళ్ళ అయిష్ట స్పర్శ... కొందరు డబ్బివ్వకపోవటం...వీళ్ళ సంపాదన అనేక రకాలుగా వీళ్ళకి దక్కకపోవటం.. ఆ ప్రపంచమంతా వో ప్రత్యేక నరకం...

మోహనరావుని దిగులు కమ్ముకుంది. ఈ ఆడాళ్ళల్లో మొండివాళ్ళు, అమాయకుల్ని మోసగించి డబ్బు దోచుకునే వాళ్ళు లేరని కాదు. వున్నా జాలి పడాల్సిన బతుకులే వాళ్ళవి.

శరీరాన్ని ఎన్నో రకాలుగా హింసకి గురిచేసి, అంతకన్నా ఎక్కువగా తమకు మనసే లేనట్టు, నిత్య నరకాన్ని, అనేక రకాల జుగుప్సలని తమలో కలిపేసుకుంటూ డబ్బు సంపాదించేది వీళ్ళు...చాలీ చాలని వీళ్ళ సంపాదనలో ఎక్కువ భాగం ఎగరేసుకుపోయేది వేరే వాళ్ళు....

"వాళ్ళిద్దరూ పద్మని తీసుకెళ్ళారుగా... ఏం చేస్తారు" కొంచెం ఆత్రంగానే అడిగాడు మూర్తి... "ఏం చేస్తారండీ...వీళ్ళు తీసికెళ్ళినచోట వీళ్ళలాంటి వాళ్ళే యింకా వుంటారు. అందరూ కలిసి అన్ని రకాలుగా బాధ పెడతారు... ఆ బాధ యీ రాత్రికో... రేపటి రాత్రికో పూర్తయ్యాక 'మొండి ముండ'.. అని తిట్టి వదిలేస్తారు. యీ గొడవంతా పద్మకి బాగా అలవాటే.." అన్నాడు రాంబాబు నిర్లిప్తంగా...

మూర్తి ఆశించినట్టు రాంబాబు వర్ణించి ఏ వివరాలూ చెప్పలేదు. పొడి పొడిగా వున్న అతని మాటల వెనుక, పద్మ భయంకర యాతన, అవమానాల ధ్వని వుంది. గ్రహించగలిగిన మనసుకే వినిపించే ధ్వని.

"ఇంత బాధపడుతూ వాళ్ళని ఎదురిస్తూ పద్మకి ఎందుకింత మొండితనం. మిగిలిన వాళ్ళలాగే సరిపెట్టుకోవచ్చు. అలా ఇష్టం లేకపోతే ఎక్కడికైనా వెళ్ళి పోయి యీ పనో..లేదా మరో పనో చేసి బతకొచ్చు ఎందుకిలా..." కొంచం అవేశంగానే అడిగాడు మోహనరావు.

" ఎందుకిలా అంటే ఏమి చెప్పనండీ...ఒక్కో మనిషి తత్వం ఒక్కో రకం.. పద్మ లాంటి వాళ్ళు ఎక్కడికి వెళ్ళినా ఏం చేసినా యింతేనండి... అసలు ఇదంతా బాధ అని తను ఒప్పుకుంటే కదా..."

"ఊరికే కబుర్లు చెప్పకు రాంబాబూ...ఎద్దుల్లాంటి యిద్దరు మగాళ్ళు పబ్లిక్‌గా లాక్కుపోయి, మరి కొందరితో చేరి నానా రకాలుగా చేస్తే...బాధనుకోకపోవటానికి....ఆ పద్మది స్పర్శ లేని ఐరన్ బాడీ ఏంటి ?" వెకిలిగా నవ్వుతూ అడిగాడు మూర్తి.

"వొంటికి బాధలేదని ఎలా అంటుందండి. పద్మలో వున్న మొండితనం, యిందాకా

మీరు రౌడీలా వుండే అన్నారు చూడండి...అదే...తన డబ్బుని అడుక్కుతినే వెధవలకి ఎందుకు లొంగివుండాలన్నదేఆమె పట్టుదల...ఎవరు పట్టించుకున్నా... పట్టించు కోకపోయినా, తనిలాగే చావనన్నా చస్తానంటుంది తప్ప, వాళ్ళకి లొంగి చెప్పినట్టల్లా వినే బానిసలా బతకనంటుంది. అందుకు ఎంత బాధకైనా సిద్ధం అంటుంది..." రాంబాబు గొంతులో బాధ వుంది.

పది మందిముందు అంతగా అవమాన పడుతూ, అంత హింసలో కూడా తలెత్తుకుని తనకి తానుగా వుండాలని పద్మ చేసే ప్రయత్నానికి ఎంతో గుండె నిబ్బరం కావాలి...ఎంతో పట్టుదల కావాలి. అది ఎవరి దృష్టికీ రాదు. వచ్చినా, ఆలోచన... ఆహాన్ని, వ్యంగాన్ని, కామాన్ని దాటి ముందుకు సాగటం అరుదు.

మూర్తి సంగతి మోహనరావుకి తెలుసు. అతని మాటల్లో పెడసరం, ఆలోచనలో వెకిలితనం వున్నాయి. కానీ మనిషి బురద గొడ్డు లాంటి వాడు. ఎవరికీ చెరుపు చెయ్యగలిగినవాడు కాదు.అయినా యీ సందర్భంలో అతని తీరు మోహనరావుకీ బాధగా వుంది. పద్మ సాహసం సామాన్యమైంది కాదు. ఆమె గురించి ఆలోచిస్తుంటే మోహనరావు మనసు రాంబాబులా మారిపోయింది. పద్మ జీవితం చుట్టూ ఆర్ద్రంగా అల్లుకుపోయింది.

"అది కాదు రాంబాబూ... ఇంత బాధపడుతూ, పద్మకి యీ మొండిజీవితంవల్ల దక్కేదేమిటి చెప్పు... కేవలం తిండి, రోజు గడపటం తప్ప, ఆమెకి వేరే ఆశలు, కోరికలూ లేవా...?" అనడిగాడు మోహనరావు.

"ఏమోనండి అవి కోరికలో... ఆశలో... ఒక్కోసారి చాలా చిత్రంగా మాట్లాడుతుంది. నాలుగు గోడలచాటు వుండి, కొంచెం స్థిమితంగా వుంటే పద్మ మాటలే వేరు. రకరకాల కబుర్లు చెపుతుంది. ఓసారి నాతో అంది...

"రాంబాబూ... యింతగా నా బతుకు రోడ్డుమీదకొచ్చాక మరో దారే లేదు. ఇంక యీ జీవితం యింతే. నాకో మగాడు, పూర్తిగా నాకే... ఎలా కుదురుతుంది చెప్పు... ఆ ఆశ కూడా దండగే... కనీసం నీతో గడపగలిగినట్టు నెలకి ఒక రోజో, రెండు రోజులో గడిస్తే చాలు...

రాత్రి చీకట్లో, స్కూలు గ్రౌండ్లలో... చీకటి మూల బాత్‌రూముల దగ్గర... నా వాళ్ళేమవుతుందో... కొట్టుకుపోతోందో రక్తం కారుతోందో ఎవరికి కావాలి? దబ్బిస్తారుగా... అంతే... ఎప్పుడేనా బాధ తట్టుకోలేక 'అమ్మా' అంటే... బాధగా వుందా? అని అడిగితే చాలు... అడగరు... పైగా దొంగవేషాలు అనుకునే వాళ్ళే ఎక్కువ...

ఇవన్నీ కాదుగానీ...నాకో పిచ్చి ఆశ వుంది రాంబాబు. చాలామంది దృష్టిలో... నేను చాలా మంది కన్నా తక్కువ దాన్ని... మరి కొందరికి మంచి మోజులో వున్నప్పుడు ఎంతో ఎక్కువ దాన్ని... అంతే తప్ప నేను వాళ్ళలాంటి మనిషిని కాదు. రిక్షా లాగేవాడు

ధైర్యంగా నేను రిక్షా వాడినంటాడు. తూములు తుడిచేవాడు నేను ఫలానా అంటాడు. కానీ నాలాంటి వాళ్ళకి చెప్పటానికేం వుంది. తప్పో, ఒప్పో నేను యీ రకంగా బతుకుతున్నానని ధైర్యంగా చెప్పుకోగలిగే అవకాశం ఏది? పైగా అలా చెప్పటం తప్పన్నట్టు తయారయ్యాయి మా బతుకులు... ఎప్పుడూ అబద్దాలే... కాలేజీ స్టూడెంట్‌ననో, మొగుణ్ణొదిలేసిన దాన్ననో.... రకరకాల కథలు.... అంతే తప్ప ఎప్పుడూ నేను నేను కాదు..."

"అంటే ఓటర్ ఐడెంటిటి కార్డులా... యీవిడకి లైసెన్స్ యివ్వాలా..." అన్నాడు మూర్తి మాటల్ని సాగదీస్తూ

అప్పటివరకూ రానంత కోపం తన్ను కొచ్చినవాడిలా రాంబాబు ఒక్కసారి వురిమి చూశాడు మూర్తి వేపు.

"లైసెన్స్ యిస్తే తప్పేమిటి సార్... లైసెన్స్ వుంటే వీళ్ళని ఎవరేనా ఎత్తుకుపోయినా... వీళ్ళల్లో ఎవరేనా చచ్చిపోయినా... కనీసం జనాభా లెఖ్ఖకేనా తెలుస్తుంది..."

ఇందాకటి రాంబాబు గొంతుక్కి యీ గొంతుక్కి పోలికే లేదు. మూర్తి కంగారు పడ్డాడు. కొంచెం నెమ్మదిగా.....

"చూడు రాంబాబు... చట్టరీత్యా వీళ్ళని గుర్తించి లైసెన్స్ యిస్తే మంచిదికాదు... అలా చేస్తే వాళ్ళని, యీ వృత్తినీ పెంచి పోషించినట్టే..." అన్నాడు మూర్తి.

"ఏమిటిరా... కొత్తగా పెంచి పోషించేది... యిదోరకం వాదన కాకపోతే... వీళ్ళిలా బతుకుతున్నారని తెలుసు. వీళ్ళ జీవితాల్ని మెరుగుపరచలేని అశక్తతా తెలుసు... అలాంటప్పుడు లైసెన్స్‌లిస్తే తప్పేమిటి? రోజుకి పదిపదిహేనుసార్లు శరీరాన్ని తప్పనిసరి శృంగారానికి గురిచేసే వీళ్ళ బతుకు లీగలైజ్ అయితే వీళ్ళకి కొంతేనా లాభం... వీళ్ళ సంపాదనని దోచుకోటం కొంతేనా తగ్గుతుంది..." అన్నాడు మోహనరావు.

"ఏమో సార్! లాభ నష్టాలు ఏమిటో... ఏమి చేస్తే ఏం జరుగుతుందో గానీ ప్రస్తుతం యీ ఆడాళ్ళు పడుతున్న బాధమాత్రం దారుణం సార్... పద్మమీద అభిమానంతో కాదు, నిజం చెపుతున్నాను. వీళ్ళ ఒక్కోరాత్రి జీవితం గురించి వింటే కడుపులో దేవుతుంది సార్..." అన్నాడు రాంబాబు.

"నిజమే రాంబాబు... వీళ్ళందరి జీవితం ఎన్నో ఏళ్ళుగా యిలాగే వుందని మన అందరికీ తెలుసు. యీ హింసని చూస్తాం. అయినా గుర్తించటానికి యిష్టపడం. గుర్తిస్తే, ఏదో ప్రమాదం అని... అతి తెలివిగా వాదిస్తాం..."అన్నాడు మోహనరావు.

"సరేలే... మనకెందుకొచ్చిన గొడవ...లే...." అంటూ అర్థాంతరంగా లేచాడు

మూర్తి.

సినిమాకి వీళ్ళకి, పార్కింగ్‌కి రాంబాబుకి టైము అయింది.

మోహనరావుకి మనసులో చాలా రకాలుగా యిబ్బందిగా వుంది. రాంబాబుతో ఏదో చెప్పాలనుంది. మూర్తి కొంచం ముందుకి నడవటం చూసి ఆగి...

"రాంబాబు ఏం అనుకోకు... మా మూర్తికి మాట తీరు తెలియదు. మనిషి చెడ్డవాడేం కాదు. పద్మకి నువ్వు ఎంత దగ్గరో నాకు పూర్తిగా తెలియదు... కానీ సాహసించి వో మాట చెపుతున్నాను. ఆమెకి నచ్చచెప్పు . ఆ అమ్మాయి జీవితంలో మార్పు తీసుకురా. ఈ వృత్తి వదిలేయమను. లేదా మిగిలిన వాళ్ల లాగే రాజీ పడమను... అంతే తప్ప కోరి కోరి బాధని పెంచుకోవద్దని చెప్పు..." అన్నాడు.

రాంబాబు మాట్లాడలేదు.

ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

మూర్తి యిదంతా చాలా తొందరగా మర్చిపోయాడు.

రాంబాబు మాత్రం పద్మ వచ్చేవరకూ ఎంతో ఆరాటంగా ఎదురు చూశాడు. మోహనరావు చెప్పినదంతా చెప్పాలనుకున్నాడు. కానీ గొంతు పెగల్లేదు.

ఆ తర్వాత రాంబాబు పద్మతో చాలా చాలా మాట్లాడాడు. కానీ ఎందుకో ఆమెని రాజీ పడమని చెప్పాలనిపించలేదు. అలా చెప్పటం ఏదో ద్రోహంలా అనిపించింది. ఆమె జీవితాన్ని మరింతగా బాధించటమేమో అనిపించింది.

రోజులు గడుస్తూనే వున్నాయి.

'పద్మ జీవితాన్ని మార్చగలనా... ఆ అవకాశం వుందా...' అనుకుంటూనే ఆమెతో అలాగే బతుకుతున్నాడు రాంబాబు.

మోహనరావు మాత్రం అటువంటి పరిసరాల్ని, పద్మలాంటి ఆడవాళ్ళని చూసినప్పుడు బాధపడుతున్నాడు. వాళ్లు పడే హింస గురించి పదిమందికీ చెపుతున్నాడు. వీళ్ళకి న్యాయపరమైన గుర్తింపు రావాలి అని మధనపడుతున్నాడు.

– రచన సచిత్ర మాసపత్రిక–నూతన సహస్రాబ్ది జన్మదిన ప్రత్యేక సంచిక

ఫిబ్రవరి – 2000